# "పవన్ కళ్యాణ్ సార్.. కలెక్టర్ సార్.. మా చదువులు ఆగిపోకుండా చూడండి!"

**-తునిలో కుల ధ్రువీకరణ పత్రాల కోసం చిన్నారుల విజ్ఞప్తి**

**-తాసిల్దార్ కార్యాలయం వద్ద ఎరుకుల కుటుంబాల నిరసన.. చదువులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన**

తుని, సెప్టెంబర్ 17 ప్రజా న్యూస్ నెట్వర్క్: కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు శుక్రవారం తుని తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తుని లోని రామకృష్ణ కాలనీకి చెందిన కుటుంబాలు తమ పిల్లల చదువులకు ఆటంకం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాయి. సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర నాయకుడు జనార్ధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కుల ధ్రువీకరణ పత్రాల కోసం గత కొన్ని నెలలుగా అధికారులను సంప్రదిస్తున్నామని బాధిత కుటుంబాలు తెలిపారు. అధికారులు కోరిన మైగ్రేషన్ సర్టిఫికెట్, ఫోటోలు, ఇతర పత్రాలను సమర్పించినప్పటికీ వివిధ కారణాలతో తమ దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ధ్రువీకరణ పత్రాలు అందకపోవడంతో పిల్లల విద్యకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. పాఠశాల విద్యతో పాటు ప్రభుత్వ పథకాలు, ఇతర విద్యా అవసరాలకు కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కూడా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. "డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సార్.. జిల్లా కలెక్టర్ సార్.. మాకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి, మా చదువులు ఆగిపోకుండా చూడండి" అంటూ విజ్ఞప్తి చేశారు. మండుటెండలో చిన్నారులు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని నినదించారు.

తాము సంచార జాతికి చెందిన వారమని, తుని పారిశ్రామిక ప్రాంతంలో సుమారు 15 నుంచి 20 ఏళ్లుగా నివసిస్తున్నామని కుటుంబాలు పేర్కొన్నాయి. తమ సమస్యను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని అధికారులను కోరాయి.




ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి అర్హతలను పరిశీలించి కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను పరిష్కరించాలని జనార్ధన్ కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలు తమ సమస్యను తక్షణమే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

## సంగారెడ్డిలో USFI ఆధ్వర్యంలో 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 18 ఖాళీ× తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్లీనరీ సమావేశాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో సుమారు 3,000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ, అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఖాళీ× జాతీయ అధ్యక్షులు ఉదయ్ కుమార్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మాదం తిరుపతి, తాటికొండ రవి, జాతీయ సలహాదారు మాదంశెట్టి అరుణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ?10,000 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని, వీడీడీూ స్థానికత నిబంధనల్లో తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి ఉమ్మడి జిల్లాకు కనీసం ఒక ప్రభుత్వ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు.విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా విద్యార్థులు, ప్రజలను సమీకరించి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, ఖాళీ× రాష్ట్ర నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు, వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.








# నేడు కోదాడలో మెగా జాబ్ మేళా

**-300 కంపెనీలు.. 3,000 ఉద్యోగాలు..**

**యువత భవిష్యత్తుకు భారీ వేదిక**

**-ప్రముఖుల హాజరు.. ఎంపికైన వారికి అక్కడికక్కడే నియామక పత్రాలు**

(కోదాడ మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

**300 కంపెనీలు.. వేలాది ఉద్యోగాలకు తలుపులు :**

కోదాడలోని సీసీ రెడ్డి విద్యానిలయంలో నేడు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాలో సుమారు 300 కంపెనీలు పాల్గొని 3,000 ఉద్యోగ అవకాశాలను అందించనున్నాయి. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఒకే వేదికపై భారీ అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

**ఉపాధి అవకాశాల కోసం యువతకు భారీ పిలుపు:**

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరుకానున్నారు. వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల అర్హత, నైపుణ్యాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నాయి.

**ఎంపికైన అభ్యర్థుల చేతికే నియామక పత్రాలు :**

సాయంత్రం మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బలమైన బాటలు వేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు

# త్రిపురారంలో మట్టి వినాయకుల దర్శనం

**మట్టి విగ్రహాల ఏర్పాటు అభినందనీయం: ఎంపీడీవో విజయకుమారి**

**పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయకుల వినియోగం అవసరం**

(త్రిపురారం మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :త్రిపురారం 1వ, 10వ వార్డుల్లో ఏర్పాటు చేసిన మట్టి వినాయక విగ్రహాలను ఎంపీడీవో కూనిరెడ్డి విజయకుమారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మట్టి విగ్రహాల ఏర్పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు, గణేష్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# గొట్టిముక్కల శివాలయంలో ఘనంగా లడ్డూ వేలం

**-రూ.51 వేలకు పెద్ద లడ్డూ.. రూ.41,500లకు చిన్న లడ్డూ**

గొట్టిముక్కల: గ్రామంలోని శివాలయంలో లడ్డూ వేలం పాటను భక్తుల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. గొట్టిముక్కల చౌదరి యువ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలం పాటలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.వేలం పాటలో 9 కిలోల పెద్ద లడ్డూను పొట్ల బసవయ్య, రామాదేవి దంపతులు రూ.51,000లకు అత్యధిక ధరకు దక్కించుకున్నారు. అలాగే చిన్న లడ్డూను బొడ్డపాటి రామకృష్ణ, ప్రియాంక దంపతులు రూ.41,500లకు వేలంలో సొంతం చేసుకున్నారు.లడ్డూలను దక్కించుకున్న భక్తులను కమిటీ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. లడ్డూ వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని శివాలయ అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# పాల్తేరులో గణనాథుడికి ప్రత్యేక పూజలు

**అభిషేకం అనంతరం గరిక పూజలో పాల్గొన్న భక్తులు**

పాయకరావుపేట, సెప్టెంబర్ 18 ప్రజా న్యూస్ నెట్వర్క్: అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరు గ్రామంలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన ఆలయంలో కొలువైన గణనాథుడికి ఉదయం 9 గంటలకు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. అభిషేకం అనంతరం భక్తుల సమక్షంలో గరిక పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు, దంపతులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. పండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది.



## అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షులు బంగారు కృష్ణ.

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 18కలుషిత ఆహారం తిని అస్వస్థత కు గురైన విద్యార్థులను తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ అధ్యక్షుడు బంగారు కృష్ణ పరామర్శించాడు..శుక్రవారం సదాశివాపేట శివారులోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థులను బంగారు కృష్ణ పరామర్శించి హాస్పిటల్ సూపర్ డెంట్ ను కలిసి విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బంగారు కృష్ణ మాట్లాడుతూ అభం శుభం తెలియని చిన్నారులకు కలుషిత ఆహారం పెట్టి 42 మంది విద్యార్థుల అస్వస్థత కు కారణమైన ఉపాధ్యాయుడి పై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని.. అదే విధంగా ఆహారం నాణ్యమైనద కాదా అని పరిశీలించకుండా అనుమతి ఇచ్చిన ప్రిన్సిపాల్ పై కూడ కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలలో ఆహారం సరఫరా పై ప్రభుత్వం కఠిన నియమ నిబంధనలు రూపొందించాలి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎల్ వేణు గోపాల్, తెలంగాణ స్టూడెంట్స్ వాయిస్ కార్యదర్శి చింతల సాయి కుమార్, మహిపాల్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు..





# 22(ఏ) భూములపై బీఆర్ఎస్ దుష్ప్రచారం

**: -సత్యం శ్రీరంగం**

(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 18

22(ఏ) భూముల విషయంలో కేటీఆర్, హరీష్‌రావు ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం విమర్శించారు. సంగారెడ్డిలో డీసీసీ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డితో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.బీఆర్ఎస్ హయాంలో ధరణి ద్వారా 22.93 లక్షల ఎకరాలను 22(ఏ) జాబితాలో చేర్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విస్తీర్ణాన్ని 7 లక్షల ఎకరాలకు తగ్గించామని, ప్రస్తుతం 3.75 లక్షల ఎకరాలు మాత్రమే 22(ఏ)లో ఉన్నాయని తెలిపారు. సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అన్నారు.బీఆర్ఎస్ హయాంలో అసైన్డ్ భూముల విషయంలో జరిగిన అక్రమాల వివరాలను త్వరలో బయటపెడతామని సత్యం శ్రీరంగం తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంపై అప్పుల భారం పెరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తూ ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు.బీజేపీ, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం ఉందన్న ఆరోపణలు చేశారు. సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తోపాజి అనంత కిషన్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చేర్యాల ఆంజనేయులు, సీడీసీ చైర్మన్ గడీల రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు





# జై భవానీ యూత్ గణేష్ మండపం వద్ద అన్నదానం



(సంగారెడ్డి మండలం) ప్రజా న్యూస్ నెట్వర్క్ సెప్టెంబర్ 18

సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జై భవానీ యూత్ గణేష్ మండపం వద్ద 12వ వార్డు కౌన్సిలర్ పొన్న రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు చింత సాయినాథ్ హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ ఉత్సవ నిర్వాహకులు చింత సాయినాథ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, భక్తులకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో కౌన్సిలర్ దశరథ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి, లాడే బాలు, కిష్టారెడ్డి, జానీ తదితరులు పాల్గొన్నారు. భక్తులు, స్థానిక యువత, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు భరోసా....



( ఎర్రగొండపాలెం:
నియోజకవర్గ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ భరోసా కల్పించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు గూదూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి సమస్యలతో కూడిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు కో కల్లలుగా ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు తరచూ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని అన్నారు. త్వరగా పరిష్కారమయ్యే సమస్యలను యుద్ధ ప్రాతిపదికన అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడం జరుగుతుందని,



మరి కొన్ని సమస్యలకు కొంత సమయం తీసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అనేక సమస్యలను ప్రజా దర్బార్ వేదికగా పరిష్కరించడం జరిగిందని సమస్యలు ఏ పాటివో వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపి మండల అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, యువ నాయకులు తోట మహేష్ నాయుడు, ముస్లిం యూత్ సొసైటీ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, సత్య నారాయణ గౌడ్, లతో పాటు మండల పార్టీ నాయకులు , కార్య కర్తలు, పాల్గొన్నారు.

# ఎన్నికలలో పార్టీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి

**పార్టీ శ్రేణుల సమావేశంలో టిడిపి ఇన్చార్జి గూడూరి**

ఎర్రగొండపాలెం:
త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని, సమన్వయంతో పనిచేసి విజయాన్ని సొంతం చేసుకోవాలని ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ గూడూరు ఎరిక్షన్ బాబు సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం



పార్టీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సలహాలు సూచనలు చేశారు. ప్రతి కార్యకర్తకు గౌరవం కల్పించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకుంటున్నారని. క్రియాశీలకంగా పనిచేసే వారికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ నిరంతరం ప్రజలలో ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనరంజక పథకాలను ప్రజల్లో తీసుకువెళ్లి అవగాహన కల్పిస్తూ రేపటి విజయానికి కృషి చేయాలని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో నిర్వహించిన ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం గా పూర్తి చేసినందుకు ఆయన నాయకులను, కార్యకర్తలను, అభిమానులను అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇదే జోష్ తో స్థానిక సంస్థల ఎన్నికలలో సైనికుడుగా పని చేయాలని అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీల కంటే అదనంగా పథకాలను తీసుకురావడం జరిగిందని, వర్గ రహితంగా అందరికీ పథకాలను వర్తింపజేశామని, ప్రతి గడపలో కూటమి ప్రభుత్వ లబ్ధిదారుడు ఉన్నారని, అభివృద్ధిని పరుగులు పెట్టి ఇచ్చామని, రానున్న ఎన్నికలలో ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి విజయానికి కోసం కృషి చేయాలని అన్నారు. మనస్పర్థలు సహజమని వాటిని వీడి సమన్వయంతో అందరూ కలిసికట్టుగా స్థానిక సంస్థల ఎన్నికలలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





# త్రిపురారంలో ఘనంగా ముగ్గుల పోటీ

-వినాయక చవితి సందర్భంగా మహిళలు, యువత, చిన్నారుల ఉత్సాహభరిత పాల్గొనడం
-సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా ఆకట్టుకున్న ముగ్గులు

(త్రిపురారం మండలం) సెప్టెంబర్ 18 ప్రజా న్యూస్ నెట్ వర్క్ :త్రిపురారం మండలంలో శ్రీశ్రీ వేణుగోపాల స్వామి యూత్ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకొని ముగ్గుల పోటీ నిర్వహించారు. మహిళలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. ముగ్గు మన సంప్రదాయం, సంస్కృతికి ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ అభినందిస్తూ, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

-పోలీసుల దర్యాప్తుతో యువతి సురక్షితంగా తల్లికి అప్పగింత
-హుజూర్‌నగర్ పోలీసుల చొరవకు కుటుంబ సభ్యుల కృతజ్ఞతలు

(హుజూర్ నగర్ మండలం) సెప్టెంబర్ 18 ప్రజా న్యూస్ నెట్ వర్క్ షేక్. అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి:హుజూర్‌నగర్ పట్టణంలోని పీర్లకొట్టం బజార్‌కు చెందిన బత్తుల మానస (19) అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హుజూర్‌నగర్ ఎస్సై



చలికంటి నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టి యువతి ఆచూకీని గుర్తించారు. అనంతరం యువతిని ఆమె తల్లి బత్తుల రమణకు సురక్షితంగా అప్పగించారు. పోలీసుల చర్యతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

# కోదాడ మెగా జాబ్ మేళా ఏర్పాట్ల పరిశీలన

ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసుల ప్రత్యేక చర్యలు
కంపెనీల స్టాల్స్, పరిసరాలను పరిశీలించిన అధికారులు



(కోదాడ మండలం) సెప్టెంబర్ 18 ప్రజా న్యూస్ నెట్ వర్క్ షేక్.అబ్దుల్ రజాక్ జిల్లా ప్రతినిధి :
కోదాడలో నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ఏర్పాట్లను మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, చింతలపాలెం ఎస్సై పరమేష్ పరిశీలించారు. భారీగా అభ్యర్థులు తరలివస్తున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలను పరిశీలించారు. కంపెనీల స్టాల్స్, పరిసర ప్రాంతాలను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ప్రతినిధి, ప్రజా న్యూస్ నెట్‌వర్క్ షేక్ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

# ఉన్నం కొండలరావును పరామర్శించిన ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు,
ఇటీవల చిన్న ప్రమాదంలో గాయపడి, ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావును కందుకూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు.
ఎమ్మెల్యే వెంట ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, గుర్రం మాల్యాద్రి, పలువురు నాయకులు ఉన్నారు.



# హుజూర్‌నగర్‌లో కవులు-రచయితల సమావేశం

**సాహిత్య కార్యక్రమాల విస్తృతికి సమన్వయంతో ముందడుగు**
**కవులు, రచయితలు, కళాకారులు, విలేకరుల హాజరు**

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్‌లో నిర్వహించిన కవులు, రచయితల సమావేశానికి ముఖ్యఅతిథిగా సుధా బ్యాంకు స్థాపకుడు పెద్దిరెడ్డి గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రతి నెల సాహిత్య సమావేశాలు, కవి సమ్మేళనాలు, చర్చా వేదికలు నిర్వహించడంతో పాటు కవులు, రచయితలను ప్రోత్సహించేందుకు కార్యాచరణపై చర్చించారు. కార్యక్రమంలో కళాకారులు గుంటి వెంకటేశ్వర్లు, పొందగాని సత్యనారాయణ, దామోదర్, దేవదానం, కృష్ణమూర్తి, చంద్రశేఖర్, రిటైర్డ్ పెన్షనర్లు, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

# అన్నదాన కార్యక్రమానికి భారీగా హాజరైన ప్రజలు

-గణపయ్య అనుగ్రహంతోనే సమస్త శుభాలు
-శ్రీనగర్ కాలనీలో ఘనంగా గణపతి పూజ, అన్నవితరణ

(హుజూర్‌నగర్ మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :హుజూర్‌నగర్ పట్టణంలోని 19వ వార్డు శ్రీనగర్ కాలనీ వినాయక మండపంలో గణపతి పూజ, అన్నవితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జున్, పట్టణ ఎస్సై నరేష్ ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నవితరణను ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రజలు భారీగా హాజరయ్యారు. కాంగ్రెస్ నాయకులు, వార్డు ప్రజాప్రతినిధులు, అధికారులు, విగ్రహ కమిటీ సభ్యులు, పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.





# డ్రోన్ ద్వారా వరి పంటకు క్రిమిసంహారక మందుల పిచికారి

**ఆధునిక సాంకేతికతతో రైతులకు అందుబాటులోకి వేగవంతమైన సేవలు**
**డ్రోన్ పిచికారీ విధానాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి**



(గరిడేపల్లి మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :గరిడేపల్లి మండలం పరెడ్డిగూడెం సమీపంలో వరి పంటలకు డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్న విధానాన్ని కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి పరిశీలించారు. డ్రోన్ ఆపరేటర్ రాతికింది శ్రవణ్‌కుమార్‌ను పిచికారీ విధానం, వినియోగం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# కోదాడలో నేడు కొలువుల జాతరకు సర్వం సిద్ధం

**జాబ్ మేళా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి**

**25 వేల దరఖాస్తులు.. 300 కంపెనీలతో భారీ ఉద్యోగ అవకాశాలు**

(కోదాడ మండలం) సెప్టెంబర్ 18, ప్రజా న్యూస్ నెట్ వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి : కోదాడలో నేడు నిర్వహించనున్న మెగా జాబ్ మేళాకు సర్వం సిద్ధమైంది. జాబ్ మేళా ఏర్పాట్లను కలెక్టర్, ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి పరిశీలించారు. ఇప్పటికే 25 వేల దరఖాస్తులు అందగా, 300 కంపెనీలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేశారు. భారీగా నిరుద్యోగ యువత హాజరుకానున్న నేపథ్యంలో 50 వేల మందికి భోజన సౌకర్యాలు కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.